నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 29-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక:56 | పేజీలు: 4 | వెల: రూ.1/-

పైడి జైరాజ్ దేశం గర్వించదగ్గ గొప్ప నటుడు : మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ , సెప్టెంబర్ 28: దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పైడి జైరాజ్ తెలంగాణకు మాత్రమే కాక, దేశం గర్వించదగ్గ గొప్ప నటుడని క్రీడా, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ప్రముఖ బాలీవుడ్ నటుడు పైడి జైరాజ్ 112 వ జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జయరాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రానికి చెందిన వైతాళికులను, కవులను, కళాకారులను, సాహితీవేత్తలను, మేధావులను, పోరాట యోధుల సేవలను గుర్తించి వారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు చెందిన సంస్కృతి, సాంప్రదాయాలను నిర్లక్ష్యం చేశారన్నారు.

దేశం గర్వించదగ్గ గొప్ప నటుడు పైడి జైరాజ్ కరీంనగర్ నుంచి సినిమా హీరో కావాలనే లక్ష్యంతో బొంబాయి వెళ్లారు. అప్పటి మూకీ సినిమాల కాలం లోనే నటుడుగా ప్రస్థానం ప్రారంభించి, ఆ తర్వాత టాకీ సినిమాలలో కూడా నటించి భారతీయ వెండి తెరపై మొదటి యాక్షన్ హీరో గా పేరు పొందారని ప్రశంసించారు. పైడి జైరాజ్ సేవలకు గుర్తుగా రవీంద్ర భారతిలోని ప్రివ్యూ థియేటర్కు పైడి జైరాజ్ ప్రివ్యూ థియేటర్ గా పేరు పెట్టి గౌరవిస్తున్నామని గుర్తు చేశారు.

ఈ థియేటర్ ఇప్పుడు నవతరం సినీ దర్శకులు, రచయితలు, నటులకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని, షార్ట్ ఫిలింలు ప్రదర్శించడం కోసం ఏర్పడ్డ ఒకే ఒక థియేటర్గా దేశం మొత్తం మీద ప్రత్యేకతను సాధించిందని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు భవిష్యత్లో ఇచ్చే అవార్డులకు పైడి జైరాజ్ పేరుతో ఇవ్వడానికి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అలాగే తెలంగాణలో వందలాది మంది యువతీ యువకులు నాటకం, సినిమా రంగాలలో ప్రతిభను ప్రదర్శించు కోవాలనే ఆశతో ఉన్నారు. దీనికి సంబంధించిన శిక్షణ కోసం పైడి జైరాజ్ ప్రివ్యూ థియేటర్ కు అనుబంధంగా భాషా సాంస్కృతిక శాఖ సారథ్యంలో ఒక యాక్టింగ్ కోర్సును నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, మహబూబ్ నగర్ మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, మంచిర్యాల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదలశాఖపై రజత్‌కుమార్ సమీక్ష

హైదరాబాద్ , సెప్టెంబర్ 28: గులాబ్ తుఫాను కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో ఇంజినీర్లతో నీటి పారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి రజత్‌కుమార్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా తలెత్తిన పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖలోని ఇబ్బందులను పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఏవైనా ఇబ్బందులుంటే కంట్రోల్ రూమ్ నంబర్ 040-23390794లో సంప్రదించాలని సూచించారు.

హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వానలతో దెబ్బతిన్న చెరువుల పరిస్థితులపై ఈ బృందాలు అధ్యయనం చేయనున్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో ప్రత్యేక బృందాల అధ్యయనం చేయనుండగా.. రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

మహారాష్ట్రలో భారీ వర్షాలు.. మరాఠ్వాడాలో 10 మంది మృతి

ముంబై, సెప్టెంబర్ 28:: మహారాష్ట్రలో కుండపోత వర్షాలు (ఊపజీలఎ తీజీతినిబ) కురుస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాల ధాటికి జనం విలవిల్లాడుతున్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా మహారాష్ట్రలోని మరాఠ్వాడా రీజియన్‌లో ఇప్పటికే 10 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతేగాక దాదాపు 200పైడా పశువులు కొట్టుకుపోయాయి. పలు ఇండ్లు దెబ్బతిన్నాయి. మరాఠ్వాడా రీజియన్‌లోని ఎనిమిది జిల్లాలు, 180 నర్కిళ్లలో రికార్డు స్థాయిలో 65 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మరణించిన 10 మందిలో మరాఠ్వాడా రీజియన్‌లోని ఆరు జిల్లాలకు చెందినవారు ఉన్నారు. బీడ్ జిల్లాకు చెందిన ముగ్గురు, ఉస్మానాబాద్, పర్భణి జిల్లాలకు చెందినవారు ఇద్దరు చొప్పున ఉన్నారు. ఇక జల్నా, నాందేడ్, లాటూర్ జిల్లాలకు చెందిన వారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. మిగితా రెండు జిల్లాలైన ఔరంగాబాద్, హింగోలిలో ఇప్పటివరకు మరణాలు నమోదు కాలేదు.

బండి సంజయ్‌పై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్ , సెప్టెంబర్ 28:బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. బురదలో పొర్లే పందికి పన్నీరు వాసన తెలియనట్లు బండి సంజయ్ తీరు ఉందని, ప్రగతి భవన్ విలువ ఆయనకు తెలియదని దుయ్యబట్టారు. టీఆర్ఎస్ ఎల్పీలో మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే బాల్క సుమన్ బీజేపీ నేతలపై కదంతొక్కారు. కాళేశ్వరం సహా అనేక ప్రాజెక్టులు నిర్మించి, తెలంగాణ రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని సుమన్ అన్నారు.

రాష్ట్రంలోని 4 కోట్లమంది ప్రజలు అందరూ కేసీఆర్ అభిమానులేనని, ఉద్యమనాయకుడే రాష్ట్ర పాలకుడై అద్భుతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు. సంక్షేమంలో దేశానికే సీఎం కేసీఆర్ పాలన ఆదర్శమని చెప్పిన బాల్క సుమన్.. రాష్ట్ర ప్రజలను బికారులన్న బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ రాసిన లేఖలో విషయం అసలు లేదని, అంతా విషమేనని విమర్శించారు. త్వరలోనే రాష్ట్రంలోని ప్రతిపక్షాలను ప్రజలంతా కలిసి నిమజ్జనం చేస్తారని జోస్యం చెప్పారు.

ఐటీ రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధిస్తోందని కేంద్ర సంఘమే ప్రశంసించిన విషయాన్ని బాల్క సుమన్ గుర్తుచేశారు. ఫార్మా రంగంలో కూడా దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉందని తెలియజేశారు. జీఎస్‌డీపీలో జాతీయ సగటు కంటే తెలంగాణే మెరుగ్గా ఉందని చెప్పారు. అదే సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై ఆయన విమర్శల వర్షం కురిపించారు. మోదీ సర్కారు రూ.119 లక్షల కోట్ల అప్పులు చేసిందంటూ నిప్పులు చెరిగారు. 35 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ సర్కారు అమ్మకానికి పెట్టిందని విమర్శించారు.అన్ని ప్రభుత్వ రంగ సంస్థలనూ 'హరేక్ మాల్' అంటూ అమ్మేస్తోందని మోదీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. అంతేకాకుండా దేశంలో అత్యధిక నేరాలు జరిగే రాష్ట్రంగా బీజేపీ ప్రభుత్వం ఉన్న ఉత్తరప్రదేశ్ ఉందని విమర్శించారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో బీజేపీ చెప్పాలని డిమాండ్ చేసిన ఆయన తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత బండి సంజయ్‌కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ పసుపు రైతులను బాండ్ పేపర్ రాసిచ్చి మరీ మోసం చేసింది బీజేపీనే అని, వారికేం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

ప్రత్యేక లక్షణాలున్న 35 కొత్త పంట రకాలను జాతికి అంకితం చేసిన ప్రధాని

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:ప్రధాని నరేంద్రమోదీ ఇవాళ ప్రత్యేక లక్షణాలున్న 35 రకాల నూతన పంటలను జాతికి అంకితం చేశారు. ఈ 35 పంట రకాలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎఆర్) అభివృద్ధి చేసింది. ప్రస్తుతం ప్రధాన సవాళ్లుగా ఉన్న పర్యావరణ మార్పులు, పోషకాహారలోపాన్ని ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ నూతన పంట రకాలను అభివృద్ధి చేశారు. అన్ని ఐకార్ ఇన్‌స్టిట్యూట్‌లు, కేంద్ర, రాష్ట్రాల అగ్రికల్చర్ యూనివర్సిటీతోపాటు కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

ప్రధాని కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇవాళ జాతికి అంకితం చేసిన 35 పంట రకాల్లో పర్యావరణ మార్పులను అరికట్టే లక్షణాలతోపాటు పోషకాహార పాళ్లు ఎక్కువగా ఉన్నాయి. కొత్త పంట రకాల్లో కరువును తట్టుకుని పెరిగే సెనగలు, వంధ్యత్వం లేని కందులు, త్వరగా దిగుబడినిచ్చే సోయాబీన్, వ్యాధి నిరోధకశక్తిగత వివిధ వరి వంగడాలు, జీవసంవర్ధనం చేసిన గోధుమలు, పెర్ల్ మిల్లెట్, జొన్నలు, బక్‌వీట్, వింగ్డ్ బీన్, ఫాబా బీన్ ఉన్నాయి.

గులాబ్ తుఫాన్ ప్రభావం ఉత్తరాంధ్రపై తీవ్రం

అమరావతి, సెప్టెంబర్ 28:గులాబ్ తుఫాన్ ప్రభావం ఉత్తరాంధ్రపై తీవ్రంగా ఉంది. విశాఖ ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉభయ గోదావరి జిల్లాలో చాలా చోట్ల వర్షాలు పడుతున్నాయి. మిగతా ప్రాంతాల్లో చెదురు ముదురు జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. గులాబ్ తుఫాన్ పశ్చిమ దిశగా పయనిస్తూ.. ప్రస్తుతం ఉత్తర తెలంగాణ ప్రాంతంలో కేంద్రీకృతమైంది. దీని ప్రభావంవల్ల ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి.

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల వర్షాలు పడుతున్నాయి. మరో 24 గంటలపాటు వర్షాలు కురుస్తాయని, తర్వాత తుఫాన్ క్రమంగా కదులుతూ అరేబియా సముద్రంలో కేంద్రీకృతమయ్యే అవకాశముందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో తెలుగు రాష్ట్రాల్లో చాలాచోట్ల వర్షాలు పడతాయని నిపుణులు చెప్పారు.

గులాబ్ తుఫాన్ కోస్తాను ముంచేసింది. రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో సోమవారం కుంభవృష్టి కురిసింది. వాగులు, వంకలు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉత్తరాంధ్రలోని అనేక చెరువులకు గండ్లు పడ్డాయి. పొంగిపొర్లుతున్నాయి. నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తీర ప్రాంతంలో గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో అనేక చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు లక్షన్నర ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. విశాఖ నగరంలో 24 గంటల్లో 350 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళంలో అనేక గ్రామాల్లో అంధకారం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా అరుగురు మృతి చెందగా, ముగ్గురు గల్లంతయ్యారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా వాన పడింది. కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. అనేక చోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లాలో జంగారెడ్డిగూడెం-ఏలూరు మధ్య రోడ్డు కోతపడింది.

శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు లక్షా 63వేల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు ముంపునకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వరి, మొక్క జొన్న, పత్తి, ఉద్యాన పండ్ల తోటలకు వృద్ధుడి మృతదేహం కొట్టుకొచ్చింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 28:: గులాబ్ తుఫాన్ తీవ్రతరం అయి వర్షాలు బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తన క్యాంపు కార్యాలయం నుంచి నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిలను సమీక్షించారు.

లోతట్టు ప్రాంతాలను గుర్తించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వర్షాలతో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ఉండేలా చర్యలు తీసుకునేలా విద్యుత్ శాఖను అలర్ట్ చేయాలని కలెక్టర్లను ఆదేశంచారు. అదే సమయంలో వైద్య ఆరోగ్యశాఖ తో పాటు రెస్క్యూ టీంలను అందుబాటులో ఉంచాలని ఆయన చెప్పారు.

మెదక్, సంగారెడ్డి జిల్లాలపై భారీగా గులాబ్ తుఫాన్ ప్రభావం

మెదక్, సెప్టెంబర్ 28:: మెదక్, సంగారెడ్డి జిల్లాలపై గులాబ్ తుఫాన్ ప్రభావం మరింత ఎక్కువగా ఉంది.

సంగారెడ్డి జిల్లాలో గడిచిన 24 గంటల్లో 4.6 సెంటీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా.. అత్యధిక వర్షపాతం సంగారెడ్డి మండలంలో నమోదైంది. కంగ్టి మండలంలో 12.1 సెం.మీ, మెదక్ జిల్లాలో సగటు వర్షపాతం, 6.3 సెం.మీ, తూప్రాన్ మండలంలో 11.5 సెం.మీ సగటు నమోదైంది. అత్యధికంగా హావేలి ఘనపూర్ మండలంలో 18.7 సెం.మీ వర్షపాతం నమోదైంది.

చకచకా బతుకమ్మ చీరల ప్యాకింగ్!

హైదరాబాద్ , సెప్టెంబర్ 28:బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలకు తెలంగాణ ప్రభుత్వం కానుకగా ఇస్తున్న బతుకమ్మ చీరలు పంపిణీకి సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే తయారీ పూర్తయిన బతుకమ్మ చీరల ప్యాకింగ్ కూడా మొదలుపెట్టారు. హైదరాబాద్‌లోని చంద్రయాణ గుట్టలోని టెస్కో గోడౌన్లలో ఈ ప్రక్రియ చకచకా నడుస్తోంది. బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా అర్హులైన మహిళలందరికీ ఉచితంగా చీరలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈసారి రూ.333 కోట్లు కేటాయించి టెస్కో ఆధ్వర్యంలో కోటి చీరలను తయారు చేయించేందుకు మూడు జిల్లాల్లోని పవర్‌లూమ్స్‌కు ఆర్డర్ ఇచ్చింది. దీంతో సిరిసిల్లలోని పవర్‌లూమ్స్‌పై 75 లక్షలు, వరంగల్‌లో 13 లక్షలు, కరీంనగర్‌లో 12 లక్షల చీరలు తయారు చేశారు. ఈ సారి 17 రంగులు, 15 డిజైన్లలో తయారైన ఈ చీరలను పలు జిల్లాలకు తరలించి గోదాముల్లో కూడా భద్రపరిచారు.

మూసీ పరీవాహక ప్రాంతాల్లో మొదటి ప్రమాద హెచ్చరిక.. ఆ ప్రాంతాలకు హై అలర్ట్..

హైదరాబాద్ , సెప్టెంబర్ 28: మూసీ పరీవాహక ప్రాంతాల్లో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. మూసీ వరద ఉధృతి దృష్ట్యా మూసారాం బాగ్ బ్రిడ్జిపై రాకపోకలు బంద్ చేశారు. హిమాయత్ సాగర్ 4 గేట్లు ఎత్తడంతో మూసీలో వరద ఉధృతి పెరిగింది. కిషన్ బాగ్, చాదర్‌ఘాట్, శంకర్ నగర్, మూసారాంబాగ్, ఓల్డ్ మలక్ పేట్ ప్రాంతాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. మరో రెండు గేట్లు ఎత్తితే మూసీకి భారీగా వరద పెరగనుంది.

మోదీజీ రైతులను చర్చలకు ఆహ్వానించండి : బాదల్

చండీగఢ్, సెప్టెంబర్ 28:: కేంద్రం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న రైతులను చర్చలకు ఆహ్వానించాలని శిరోమణి అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ మంగళవారం ప్రధాని మోదీని కోరారు. ఈ సందర్భంగా చట్టాలను రద్దు చేసేందుకు ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని చేస్తూ బంద్ నిర్వహించిన విషయం తెలిసిందే.

ఈ క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యక్తిగతంగా వెంటనే ప్రధాని జోక్యం చేసుకొని నల్ల చట్టాలను రద్దు చేసేందుకు ముందస్తు షరతులు లేకుండా రైతులను చర్చలకు ఆహ్వానించాలన్నారు. దేశ ప్రజలంతా అన్నదాత వెంటే ఉన్నారని ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. ఇదిలా ఉండగా.. గతేడాది పార్లమెంట్‌లో ఆమోదించిన మూడు వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం, రైతుల సంఘాల మధ్య ఇప్పటి వరకు 11 రౌండ్ల పాటు చర్చలు జరగ్గా.. ఎటూ తేలకుండా ముగిసిన విషయం తెలిసిందే.

చరిత్రలో నేటినిజం

కలా సుందరమగు.సుకుమారమగు
చంద్రమ్మన వెండి తెరకు చదురుగ పాడగన్
హిందీ సీమ మా చూడ
స్తుందుగ నెన్నగ నగ "మహామూదు"ను దలతున్

(సెప్టెంబర్ 29 హిందీ హాస్యనటుడు మహమూద్ పుట్టిన రోజు...)

-రాధశ్రీ

సెల్: 9494481210



ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో టూరిజం పాత్ర అద్వితీయం

('ప్రపంచ పర్యాటక దినం' సందర్భంగా)

ప్రపంచ పర్యాటక రంగానికి ఊతం ఇవ్వడానికి 27 సెప్టెంబర్ 1970న తీసుకున్న తీర్మానం ప్రకారం అంతర్జాతీయ టూరిజం సమాజం 'ఐరాస వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్, యుయన్‌డబ్ల్యూటిఓ'ను ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించడంతో ప్రతి ఏట 27 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'ప్రపంచ పర్యాటక దినం (వరల్డ్ టూరిజం డే)' పాటించుట 1980 నుంచి ఆనవాయితీగా మారింది. పర్యాటకంతో ప్రపంచ దేశాల, ప్రాంతాల ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, ఉద్యోగ ఉపాధుల విలువలు ప్రభావితం అవుతాయనే అవగాహనను కల్పించేందుకు 'ప్రపంచ పర్యాటక దినం' వేదికలను వినియోగిస్తారు. 1997 నుంచి 'వరల్డ్ టూరిజం డే' వేడుకలను ఒక్కోదేశంలో నిర్వహిస్తూ, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మంది ఉద్యోగుల్లో ఒక్కరు పర్యాటకరంగానికి సంబంధించిన ఉద్యోగాల్లోనే ఉన్నారని అంచనా.

సృజనశీల వినూత్న భావనలు, డిజిటల్ విప్లవ ఫలాలతో టూరిజం పరిశ్రమ రూపు రేఖలు ఆసాంతం మారిపోయాయి. కోవిడ్-19 విపత్తుతో అభివృద్ధి చెందిన, చెందుతున్న ప్రపంచ దేశాల సామాజిక, ఆర్థికరంగాలు గత 18 మాసాలుగా కుదేలై చితికి పోయాయి. కరోనా విపత్తు వల్ల ప్రపంచ టూరిజం 4 ట్రిలియన్లు నష్టపోయిందని అంచనా వేశారు. పర్యాటక పరిశ్రమలోని మిలియన్ల ఉద్యోగాలను కరోనా మింగేసింది. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలు కరోనా కోరల్లో చిక్కి విలవిలలాడడం నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాం. మూసిపోయిన పర్యాటకరంగ తలుపుల్ని తెరిసి తిరిగి పూర్వ స్థితికి రావడానికి కృషి ప్రారంభించాల్సిన సంధికాలంలో ఉన్నాం. కోవిడ్-19 3వ అల రాకపోవచ్చనే ఆశలతో 'ప్రపంచ పర్యాటక దినం-2021' వేడుకలకు 'సమగ్రాభివృద్ధిలో పర్యాటకం (టూరిజం ఫర్ ఇన్‌క్లూజ్యూ గ్రోత్)' అనే నినాదాన్ని తీసుకున్నారు. 'ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030'లో ప్రముఖమైన పేదరిక నిర్మూలన, ఆకలిని అంతం చేయడం, లింగ సమానత్వం, ఆర్థిక ప్రగతి లాంటివి సాధించడానికి పర్యాటకరంగం కూడా ఎంతగానో దోహదపడుతుందని గమనించాలి. కరోనా పూర్వ పర్యాటక స్థితి రావడానికి మరికొంత సమయం తీసుకొంటుంది. 2020 కరోనా అకాలంలో ప్రపంచ పర్యాటకం 60-80 శాతానికి పడిపోయిందని, కనీసం 100-120 మిలియన్ల ప్రత్యక్ష ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని తెలుస్తున్నది. దేశీయ పర్యాటకం ప్రారంభమైతేనే అంతర్జాతీయ టూరిజం మె?గ్గలు తొడుగుతుంది. ప్రస్తుతం పర్యాటకం రెక్కలు తొడగడానికి టీకా ఉద్యమం దోహదపడాలి.

ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంగా పర్యాటకానికి పేరుంది. గత కొన్ని ఏండ్లుగా ప్రపంచ పర్యాటకం అనేక రేట్లు పెరగడం, ఆధునిక హంగులు తొడగడం చూశాం. 1950లో అంతర్జాతీయ పర్యాటకులు 5 మిలియన్లు (2 బిలియన్ల డాలర్ల రెవెన్యూ) నమోదు కాగా, 2019లో 1.3 బిలియన్ల (1,260 ట్రిలియన్ డాలర్ల రెవెన్యూ) వరకు పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. గ్లోబల్ డిజిపీలో పర్యాటక పరిశ్రమ 10 శాతంగా ఉందని అంటున్నారు. ప్రతి ఏట ప్రపంచ పర్యాటకాభివృద్ధి 3 శాతం పెరగాలని లక్ష్యం చేసుకున్నారు. పర్యాటక పరిశ్రమ ఊపులో ఉన్న భారత్‌లో దేశ జిడిపీలో 9.2 శాతంగా ఉంటూ అతి వేగంగా విస్తరిస్తోంది. దేశ పర్యాటక పరిశ్రమలో 43 మిలియన్ల ఉద్యోగులు పని చేస్తూ, ప్రతి ఏట 10 మిలియన్లకు పైగా విదేశీ పర్యాటకులతో దినదినాభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా ఉత్తర భారతం నుంచి దక్షిణం వరకు వెలసిన విలక్షణ జన జాతులు, విభిన్న సంస్కృతులు, వారసత్వ సంపదలు, ప్రకృతి పరిచిన అందాల విందులు, పుణ్య తీర్థయాత్రలు, అద్భుత కట్టడాల రమణీయతలు, పర్యాటకంతో ప్రపంచ శాంతి, సోదర భావం, సాంస్కృతిక వినిమయం, పరమత సహనం లాంటి ముఖ్య అంశాలు సిద్ధిస్తాయి. ఇండియాలోని కేరళ, ఉత్తరాఖండ్, హిమాచల్ లాంటి రాష్ట్రాలు పర్యాటకం మీదనే అధికంగా ఆధారపడి ఉన్నాయి. అంతర్జాతీయ విమానాయాన రంగంతో మె?దలు అతి చిన్న గ్రామీణ బడుగు కుటుంబాల వరకు అందరినీ అక్కున చేర్చుకొని పర్యాటకులకు ఆహ్లాదాన్ని, స్థానికులను ఉపాధులను ప్రసాదిస్తున్న పర్యాటక పరిశ్రమ మళ్ళీ తేరుకొని, పుంజుకొని మిలియన్ల కుటుంబాల్లో నవ్వుల పువ్వులు పూయించాలని కోరుకుందాం. ప్రతి ఒక్కరం జీవితంలో తరుచుగా పర్యాటక ప్రణాళికలు వేసుకొని, పర్యాటకుడిగా ఆనందానుభూతులు పొందుతూ, పలువురికి ఉద్యోగ ఉపాధుల కల్పనలో పరోక్షంగా దోహదపడదాం. విశ్వ రహస్యాలు, దర్శనీయ స్థలాలు, ప్రకృతి అందాలు తెలుసుకునేందుకు ప్రయాణాలకు సిద్ధం అవుదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

29 తేదీల్లో ఎంజీయూ పరిధిలో పరీక్షలు వాయిదా

నల్లగొండ, సెప్టెంబర్ 28:: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో జరిగే పలు పరీక్షలు వాయిదా పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీగా వర్షాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 28, 29 జరుగన్ను డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ పరీక్షలు వాయిదా వేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ మిర్యాల రమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే టైంటేబుల్లో తెలిపిన ప్రకారం ఈ నెల 30వ తేదీన జరగాల్సిన పరీక్ష యథాతథంగా జరుగుతుందని పేర్కొన్నారు. వాయిదా పడిన పరీక్షల నిర్వహణను త్వరలో తేదీలను ప్రకటిస్తామన ఆయన తెలియజేశారు.

8000 కేజీల బీఫ్ సీజ్.. ఇద్దరు వ్యక్తులు అరెస్టు

థానే, సెప్టెంబర్ 28:: మహారాష్ట్ర పోలీసులు సుమారు 8 వేల కిలోల ఆవు మాంసాన్ని సీజ్ చేశారు. ఈ కేసులో ఇద్దరు వ్యక్తుల్ని అరెస్టు చేశారు. అక్రమంగా బీఫ్‌ను తరలిస్తున్నట్లు థానే నగర పోలీసులు కేసు బుక్ చేశారు. నాసిక్-ముంబై హైవేపై ఉన్న ఖారేగావ్ టోల్ వద్ద ఓ టెంపోను అడ్డుకున్న పోలీసులు ఆ వాహనంలో అక్రమంగా బీఫ్ తరలిస్తున్నట్లు గుర్తించారు. నాసిక్ జిల్లాలోని మాలేగావ్ నుంచి ముంబై సమీపంలోని కుర్లా ఆ మాంసాన్ని తరలిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. ఆ మాంసం ఖరీదు సుమారు 8 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. టెంపోను కూడా సీజ్ చేశారు. అదపులోకి తీసుకున్న ఇద్దర్ని రాయిస్ అహ్మద్ సలామ్ ఖురేషి, అబ్దుల్ అహ్మద్ నసీమ్ ఖాన్‌లు గుర్తించారు. గోవును వధించడం, గో మాంసాన్ని అక్రమంగా తరలించడంపై రాష్ట్రంలో నిషేధం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గత నాలుగైదు రోజుల నుంచి పోలీసులు సుమారు 14 టన్నుల బీఫ్‌ను పట్టుకున్నారు.

శ్రామికులకు కోవిడ్ టీకా మందును ఇప్పించండి వారికి నెలవారీ ఆరోగ్య పరీక్షలు జరపండి: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:పార్లమెంటు నూతన భవనం నిర్మాణం పనుల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 సెప్టెంబర్ 26వ తేదీ సాయంత్రం పూట ఆ ప్రదేశాని కి వెళ్ళి, తనిఖీ చేశారు. ఆయన అక్కడ జరుగుతున్న పనుల ను సమీక్షించారు.

ఆ ప్రదేశం లో జరుగుతున్న పనుల లో పురోగతి ని గురించి ఆయన నిర్ధారణ చేసుకొన్నారు. ఆ ప్రాజెక్టు ను సకాలం లో పూర్తి చేయవలసిందంటూ నొక్కి చెప్పారు. శ్రామికుల తో ఆయన మాట్లాడి, వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకొన్నారు. వారు ఒక పవిత్రమైన, చరిత్రాత్మకమైన కార్యం లో తలమునకలు అయ్యారని ఆయన స్పష్టం చేశారు.

ఆ ప్రదేశం లో పని చేస్తున్న వారందరికీ కోవిడ్ నిరోధక టీకా మందు ను తప్పక ఇప్పించాలి అంటూ ప్రధాన మంత్రి ఆదేశించారు. వర్కర్ లు అందరికీ పత్రి నెల ఆరోగ్య పరీక్షల ను నిర్వహించాలని కూడా అధికారుల కు ఆయన సూచించారు. నిర్మాణం పనులు ఒకసారి పూర్తి అయ్యాయి అంటే నిర్మాణ శ్రామికులు అందరి వివరాల తోను ఒక డిజిటల్ ఆర్కైవ్ ను తప్పక ఏర్పాటు చేయాలని, ఆ డిజిటల్ ఆర్కైవ్ లో వారి పేరు లు, వారి ఛాయాచిత్రాలు, వారు ఏ ప్రాంతాని కి చెందిన వారు అనేటటు వంటి వ్యక్తిగత వివరాలు పొందుపం చాలని, నిర్మాణ కార్యం లో వారి తోడ్పాటు కు గుర్తింపు ను ఇవ్వాలని ఆయన అన్నారు. అంతేకాకుండా, ఈ ప్రయాస లో పాలుపంచుకొన్న వారి పాత్రల ను గురించి తెలియజేసే ధ్రువ పత్రాల ను కూడా శ్రామికులు అందరికీ ఇవ్వాలి అని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి చేపట్టిన ఈ ఆకస్మిక తనిఖీ వేళ లో భద్రత పరం గా అతి తక్కువ జాగ్రత్తల ను తీసుకోవడమైంది. ఆయన ఆ ప్రదేశం లో ఒక గంట కు పైగా కాలాన్ని వెచ్చించారు.

పాడి పరిశ్రమలోని మహిళల కోసం దేశవ్యాప్త శిక్షణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:గ్రామీణప్రాంత మహిళలకు సాధికారత కల్పించడానికి మరియు వారిని ఆర్థికంగా స్వతంత్రంగా మార్చే ప్రయత్నంలో జాతీయ మహిళా కమిషన్ పాడి వ్యవసాయంలో మహిళల కోసం శిక్షణ మరియు సామర్థ్యం పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందుకో భారతదేశం అంతటా వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో కమిషన్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. పాడి వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలలో విలువ జోడింపు, నాణ్యత మెరుగుదల, ప్యాకేజింగ్ మరియు పాల ఉత్పత్తుల మార్కెటింగ్ వంటి విభిన్న అంశాలలో మహిళలను గుర్తించి, శిక్షణ ఇస్తుంది.

హర్యానా రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌తో హర్యానాలోని హిస్సార్, లాలా లజపతిరాయ్ యూనివర్శిటీ ఆఫ్ వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్‌లో మహిళా ఎస్‌హెచ్‌జి గ్రూపుల కోసం 'వాల్యూ యాడెడ్ డైరీ ప్రొడక్ట్స్' అనే అంశంపై ఈ ప్రాజెక్ట్ కింద మొదటి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభించిన సందర్భంగా మహిళా సాధికారతకు ఆర్థిక స్వాతంత్ర్యం కీలకమని ఎన్‌సిడబ్లూ చైర్‌పర్సన్ శ్రీమతి రేఖా శర్మ అన్నారు. గ్రామీణ భారతదేశంలోని మహిళలు పాడి వ్యవసాయంలో ప్రతి భాగంలో పాలుపంచుకుంటున్నారని, వారు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించలేకపోయారని ఆమె అన్నారు. ఎన్‌సిడబ్లూ తన ప్రాజెక్ట్ ద్వారా మహిళలకు శక్తినివ్వడం మరియు పాల ఉత్పత్తుల నాణ్యతను పెంచడం, దాని విలువ జోడింపు, ప్యాకేజింగ్ మరియు షెల్ఫ్ జీవితాన్ని పెంచడం మరియు వారి ఉత్పత్తుల మార్కెటింగ్ పెంచడం ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడానికి సహాయం చేస్తుందని తెలిపారు.

సుస్థిర ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి మహిళలు తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ కృషి చేస్తోంది. కమిషన్ ఎల్లప్పుడూ మహిళల సమానత్వం కోసం కృషి చేస్తోంది. ఎందుకంటే ఆర్థిక వ్యవస్థలో సగం మంది జనాభాను తమ అత్యుత్తమ పనితీరును నిలిపివేయడంతో విజయం సాధించలేమని గట్టిగా విశ్వసిస్తుంది.

పాడి వ్యవసాయ రంగంలో విస్తరణ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడానికి శాస్త్రీయ శిక్షణ మరియు ఆచరణాత్మక ఆలోచనల శ్రేణి ద్వారా మహిళా రైతులు మరియు స్వయం సహాయక బృందాలకు సహాయం చేయడం ఎన్‌సిడబ్లూలక్ష్యం. ఈ కమిషన్ మహిళలకు వారి వ్యాపారాన్ని మెరుగుపరచడానికి మరియు వ్యవస్థాపకత వైపు ప్రోత్సహించడానికి శిక్షణను అందిస్తుంది. ఎన్‌సిడబ్లూ కూడా మహిళా పారిశ్రామికవేత్తలు, మహిళలు నడిపే పాల సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయక బృందాలు మొదలైన వాటికి శిక్షణ ఇచ్చే శిక్షకులను ఎంపిక చేస్తుంది. ఎన్‌సిడబ్లూ పాడి రంగంలో మరింత స్థిరమైన మరియు పునరావృతమయ్యే జిల్లా స్థాయి నమూనాను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పాడి ఉత్పత్తులను రూపొందించడంలో మరియు మార్కెటింగ్ చేయడంలో మరియు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడానికి మహిళలకు శక్తిని అందించడంలో గ్రామాలలో ఉన్న అపారమైన సామర్థ్యం పెంపొందించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం.

హుజురాబాద్ లో ఎలక్షన్ కోడ్.. ప్రభుత్వ పథకాలకు నో బ్రేక్స్

హుజురాబాద్, సెప్టెంబర్ 28:తెలంగాణలోని హుజూరాబాద్ ఉప ఎన్నిక షెడ్యుల్ విడుదల కావడంతో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి శశాంక్ గోయల్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించి కరీంనగర్, హన్మకొండ జిల్లాల్లో నిబంధనలు అమల్లో ఉంటాయని ఆయన తెలిపారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధుకు కూడా అడ్డంకులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించి 20 మంది స్టార్ క్యాంపెయినర్లకు అనుమతి ఇచ్చామని చెప్పారు. నిబంధనలకు లోబడి ప్రచారం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎన్నకల కోసం ఈవీఎంలతోపాటు ఎన్నికల ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్‌కు 72 గంటల ముందే ప్రచారం ముగించాలని చెప్పారు. ఎన్నికల నియామవళికి సంబంధించి సంబంధిత కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కొవిడ్ నిబంధనలను అధికారులు కఠినంగా అమలు చేయాలని శశాంక్ గోయల్ ఆదేశించారు.

హుజూరాబాద్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 47 పోలింగ్ కేంద్రాల్లో వెయ్యి కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నారు. వయోవృద్ధులకు, దివ్యాంగులకు, కొవిడ్ రోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని వివరించారు. కాగా, హుజూరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,36,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,17,552, మహిళ ఓటర్లు 1,18,716 మంది ఉన్నారు.

నెల రోజులు పూర్తి చేసుకున్న ప్రజా సంగ్రామ యాత్ర..

హైదరాబాద్ , సెప్టెంబర్ 28:తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర నెల రోజులు పూర్తి చేసుకుంది. మరో నాలుగు రోజుల్లో ఆయన మొదటివిడత యాత్ర ముగియనుంది. అవినీతి, నియంతృత్వం, కుటుంబపాలన నుంచి విముక్తి కోసమంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆగస్ట్ 28న ప్రజా సంగ్రామ యాత్ర చేపట్టారు. హైదరాబాద్ భాగ్యలక్ష్మి దేవాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర హైద్రాబాద్, రంగా రెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల మీదుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చేరుకుంది. ఈ నెల రోజుల్లో రెండు రోజుల బ్రేక్ తప్ప మిగతా అన్ని రోజులు పాదయాత్ర జరిగింది. సెప్టెంబర్ 10 వినాయక చవితి రోజు, సెప్టెంబర్ 17 అమిత్ షా సభ రోజు ఆయన యాత్ర జరగలేదు.

ఈ యాత్రలో కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ నేతలు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ నేతలు పాల్గొన్న ఈ యాత్రలో.. స్థానిక సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు సంజయ్. పార్టీ ఎక్కడ బలంగా ఉంది స్థానిక నాయకుల పరిస్థితి ఏంటీ అనే క్లారిటీకి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ వారి ప్రసంగాలు సాగాయి. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, రమణ్‌సింగ్.. ఐదుగురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. సంగ్రామ యాత్రలో భాగంగా ఇప్పటివరకు సుమారు నాలుగు వందల కిలోమీటర్లు నడిచారు బండిసంజయ్. దారి వెంబడి తనను కలిసిన వారితో మాట్లాడుతూ ముందుకు సాగారు. వివిధ వర్గాలవారు.. తమ సమస్యలను సంజయ్ దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన పలు అంశాలపై సీఎంకి లేఖ రాశారు. అక్టోబర్ 2తో సంజయ్ మొదటి విడత యాత్ర ముగియనుంది. ఉపఎన్నిక జరగాల్సి ఉన్న హుజూరాబాద్ నియోజకవర్గంలో ఆయన ప్రజా సంగ్రామ యాత్రను భారీ రోడ్ షోతో ముగించాలని నిర్ణయించారు. ఈ ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పాల్గొననున్నారు.

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ 17 వ ఏర్పాటు దినోత్సవాన్ని ప్రారంభించనున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ 17 వ ఆవిర్భావ దినోత్సవాన్ని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా రేపు న్యూఢిల్లీలో ప్రారంభించనున్నారు. ఈ సంవత్సరం ఆవిర్భావ దినోత్సవంలో హిమాలయ ప్రాంతంలో చోటుచేసుకుంటున్న విపత్తు సంఘటనల ప్రభావాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కార్యక్రమ ముగింపు సమావేశంలో ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పికె మిశ్రా ప్రసంగిస్తారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రులు శ్రీ నిత్యానంద్ రాయ్, శ్రీ అజయ్ కుమార్ మిశ్రా, శ్రీ నిసిత్ ప్రామాణిక్, కేంద్ర హోంశాఖ కార్యదర్శులు కూడా కార్యక్రమానికి హాజరవుతారు.

హిమాలయ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడడం, ఆకస్మిక భారీ వర్షాలు, భూకంపాలు, మంచు చరియలు కరగడం వల్ల వస్తున్న వరదలు లాంటి అంశాలపై సాంకేతిక సదస్సుల్లో నిపుణులు ప్రసంగిస్తారు.

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సభ్యులు మరియు అధికారులు, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ , జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం , జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ , కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు , వివిధ రాష్ట్రాల అగ్నిమాపక మరియు అటవీ శాఖల అధికారులు, పౌర సంస్థల ప్రతినిధులు, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మాజీ సభ్యులు మరియు సలహా కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఈ సందర్భంగా కింది పథకాలకు సంబంధించిన పత్రాలు విడుదల చేయబడతాయి:

1. ఆప్తమిత్ర
జి.) ఆప్తమిత్ర శిక్షణ మార్గదర్శకాలు
బి.) ఆప్తమిత్ర పథకం పూర్తి వివరాలు
2.సిఏపి (కామన్ ఎలెర్ట్ ప్రోటోకాల్)
కామన్ ఎలెర్ట్ ప్రోటోకాల్ (సిఏపి) పథకం పత్రం
3. భూకంప నిరోధక నిర్మిత వాతావరణం కోసం సరళీకృత మార్గదర్శకాలు
4. చలి గాలులపై మార్గదర్శకాలు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో పనిచేస్తున్న జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ భారతదేశంలో విపత్తు నిర్వహణ చర్యలను అమలు చేస్తున్నది. విపత్తు నిర్వహణ చట్టం, 2005 కింద రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థలను నెలకొల్పి వాటి నిర్వహణకు అవసరమైన సంస్థాగత సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించవలసి ఉంటుంది. విపత్తు నిర్వహణ కోసం విధానాలు, ప్రణాళికలు మరియు మార్గదర్శకాలను జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ రూపొందించి అమలు చేస్తున్నది. ప్రకృతి వైపరీత్యాల నివారణ, ఉపశమనం, సంసిద్ధత మరియు ప్రతిస్పందన అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ దేశంలో అభివృద్ధి ప్రణాళికలు అమలు జరుగుతున్నాయి.

హుజురాబాద్ ఉప ఎన్నిక: కాంగ్రెస్ అభ్యర్థిపై ఇంకా సస్పెన్స్!

హైదరాబాద్ , సెప్టెంబర్ 28:తెలంగాణలో హుజురాబాద్ ఉపఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల వేడి మొదలైంది. ఉపఎన్నిక కోసం ఇప్పటికే టీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అభ్యర్థి ప్రకటించారు. ఆత్మగౌరవం పేరుతో రాజీనామా చేసిన మాజీ మంత్రి ఈటల రాజేందరే బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉండగా.. టీఆర్ఎస్ తరుపున గెల్లు శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఈ రెండు పార్టీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. అయితే, ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటి వరకు తమ పార్టీ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. కాంగ్రెస్ తరుపున మాజీ మంత్రి కొండా సురేఖ బరిలో ఉంటారని గత కొద్ది రోజులు ప్రచారం జరుగుతోంది. పార్టీ అధిష్టానం సైతం ఆమె పేరు ఖరారు చేసినట్లు గతంలో కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అయితే, నేటికి కొండా సురేఖ పేరును మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ కూడా బరిలో ఉంటారనే చర్చ జరుగుతోంది. ఈ నెల 30న భూపాలపల్లిలో కాంగ్రెస్? భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఆ సభ తర్వాతే కాంగ్రెస్ తమ అభ్యర్థిని ప్రకటింటనున్నట్టు తెలుస్తోంది.

పంజాబ్‌లో కీలక పరిణామం.. పీసీసీ పదవికి సిద్ధూ రాజీనామా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పంజాబ్ లో రాజకీయాలు మళ్లీ రసవత్తరంగా మారాయి. ఇటీవల సీఎం పదవికి అమరీందర్ సింగ్ రాజీనామా చేయగా.. తాజాగా పంజాబ్ పీసీసీ చీఫ్ పదవికి నవజ్యోత్‌సింగ్ సిద్ధూ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి పంపించారు. పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేసినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తానని సిద్ధూ లేఖలో పేర్కొన్నారు. పంజాబ్ లో సిద్ధూ వర్సెస్ కెప్టెన్ అమరీందర్ సింగ్ గా రాజకీయాలు సాగుతున్నాయి. సిద్ధూతో దేశానికి ముప్పు ఉందని, అతనికి పాకిస్థాన్ తో సంబంధాలు ఉన్నాయంటూ ఇటీవల అమరీందర్ సింగ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే, ఇప్పుడు సిద్ధూ పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కాగా, సీఎం అమరీందర్ సింగ్ తన పదవికి రాజీనామా చేయడంతో.. ఆయన స్థానంలో కొత్త ముఖ్యమంత్రిగా చరణ్‌జీత్ సింగ్ చన్నీ ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే.

రాధేయ కవితా పురస్కారం
ఉత్తమ కవిత పురస్కారం
డా. రాధేయ
కవితా పురస్కారం
2020
2021
03-10-2021,
ఉదయం 10.00 గంటలకు,
పలమనేరు
సభాధ్యక్షులు :
పలమనేరు బాలాజీ
పురస్కార ప్రదాత :
డా.రాధేయ
ముఖ్య అతిథులు :
ఆచార్య మేడిపల్లి రవికుమార్
ఆచార్య మధురాంతకం నరేంద్ర
పురస్కారం
ప్రదానం
అనంతరం
కవి సమ్మేళనం
పురస్కార గ్రహీతలు-2020
శ్రీనివాస్ వాసుదేవ్ (ప్రధాన పురస్కారం)
లావణ్య సైదీశ్వర్ (ఉత్తమ పురస్కారం)
బిల్ల మహేందర్ (ఉత్తమ పురస్కారం)
పురస్కార గ్రహీతలు-2021
వైష్ణవి శ్రీ (ప్రధాన పురస్కారం)
కరణం కళ్యాణ్ కుమార్ (ఉత్తమ పురస్కారం)
పురస్కార కవితల సమీక్ష :
అనిల్ డ్యాని, పల్లిపట్టు నాగరాజు
వ్యవస్థాపకులు :
దోర్నాదుల సిద్ధార్థ, పెళ్లూరు సునీల్ సుంకర గోపాలయ్య
సహకారం : పలమనేరు రచయితల సంఘం

మహారాష్ట్రలో ఆదాయపు పన్ను శాఖ సోదాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:మహారాష్ట్రలో జల్నా ప్రాంతంలో ఉన్న నాలుగు ప్రధాన స్టీల్ రోలింగ్ మిల్లులను కలిగి ఉన్న ఒక గ్రూపు లావాదేవీలకు విషయమై ఆదాయపు పన్ను శాఖ 23.09.2021న సోదాలు, జప్తు కార్యక్రమాలను నిర్వహించింది. ఆయా కంపెనీలు వ్యర్థ ఉక్కును తమ ముడిసరుకుగా ఉపయోగించే స్టీల్ టీఎంటీ బారులు, బిల్లెట్ల తయారీ వ్యాపారంలో నిమగ్నమై ఉన్నాయి. జల్నా, ఔరంగాబాద్, పుణే, ముంబయి మరియు కోల్‌కతాలలోని మొత్తం 32కు పైగా ప్రాంగణాలలో ఈ సోదాలు మరియు జప్తు ఆపరేషన్ జరిగింది. సోదాలు, జప్తు కార్యక్రమాలను నిర్వహిస్తున్న సమయంలో, అనేక నేరపూరిత పత్రాలు, వదులుగా ఉండే విలువైన పత్రాలు మరియు ఇతర డిజిటల్ ఆధారాలు కనుగొనబడ్డాయి. వీటిని స్వాధీనం చేసుకున్నారు. ఎంట్రీ ప్రొవైడర్‌లను ఉపయోగించి కొనుగోళ్ల ద్రవ్యోల్బణం చూపడం, లెక్కకు చూపని నగదు ఖర్చులు మరియు పెట్టుబడులు మొదలైన వాటితో సహా సాధారణ ఖాతాల పుస్తకాల వెలుపల పెద్ద ఎత్తున లెక్కకు చూపని ఆర్థిక లావాదేవీలలో కంపెనీల ప్రమేయం కలిగిన పలు సాక్ష్యాలు ఈ సోదాలలో స్పష్టంగా వెలుగులోకి వచ్చాయి. షేర్ ప్రీమియం, డొల్ల కంపెనీలను ఉపయోగించి అసురక్షిత రుణాల ముసుగులో కంపెనీలు గణనీయంగా లెక్కించని ఆదాయాన్ని లాండరింగ్ చేసినట్టుగా కూడా ఆధారాలు ఈ సోదాలలో వెలుగులోకి వచ్చాయి. దాదాపు రూ.200 కోట్లకు మించి లెక్కించని కొనుగోళ్లకు సంబంధించిన ఆధారాలు కనుగొనబడ్డాయి. కంపెనీల ఫ్యాక్టరీ ఆవరణలో కూడా పెద్ద మొత్తంలో లెక్కించబడని స్టాక్ కనుగొనబడ్డాయి. సోదాల నిర్వహణ సమయంలో 12 బ్యాంక్ లాకర్లు బయటపడ్డాయి. రూ.2.10 కోట్లు కంటే ఎక్కువ గాలెక్కకు చూపని నగదు మరియు రూ.1.07 కోట్ల విలువ కలిగిన జ్యువెల్లరీ మొత్తం వివిధ ప్రాంగణాల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు కనుగొన్న ఆధారాల ప్రకారం లెక్కలు చూపని ఆదాయం రూ. 300 కోట్ల మేర గుర్తించబడింది. నాలుగు కంపెనీలలో ఇప్పటికే రూ.71 కోట్ల మేర అదనపు ఆదాయాన్ని కలిగి ఉన్నట్టుగా సోదాలలో తేలింది. ఈ విషయమై తదుపరి విచారణ కొనసాగుతోంది.

జూరాల ప్రాజక్టుకు వరద.. 5 గేట్లెత్తి దిగువకు నీటి విడుదల

ఆత్మకూరు, సెప్టెంబర్ 28:: ప్రియదర్శిని జూరాల ప్రాజక్టుకు క్రమంగా వరద పెరుగుతోంది. అల్పపీడన ప్రభావంతో ఎగువన కురుస్తున్న వర్షాలకు సోమవారం ఉదయం నుంచి క్రమంగా వరద ప్రవాహం పెరిగింది. దీంతో తెల్లవారుజాము వరకు 2 గేట్లు ఎత్తి ఉం డగా ఉదయాన్నే 7గేట్లు ఎత్తారు. 9గంటల వరకు 8 గేట్లెత్తి మధ్యాహ్నం వరకు కొనసాగగా మధ్యాహ్నం 3గంటల తరువా త గేట్లను తగ్గించారు. సాయంత్రానికి 5 గేట్లెత్తి స్పిల్‌వే ద్వారా 34,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎడమ కాలువకు 945 క్యూసెక్కులు, కుడి కాలువకు 672, సమాంతర కాలువకు 850, భీమా -1కు 650, భీమా-2కు 750, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 32,775 క్యూసెక్కుల నీటిని విద్యుదుత్పత్తికి విడుదల చేస్తుండగా ఎగువ, దిగువ విద్యుత్కేంద్రాలలో విద్యుదుత్పత్తి నిర్విరామంగా కొనసాగుతున్నది.

ఎగువ జూరాల జలవిద్యుత్ కేంద్రంలో 3.955 మి.యూ ఉత్పత్తి జరుగగా ఇప్పటి వరకు మొత్తంగా 213.241 మి.యూ ఉత్పత్తి జరిగింది. దిగువ జూరాల విద్యుత్కేంద్రంలో 4.86 మి.యూ ఉత్పత్తి జరుగగా మొత్తంగా 236.875 మి.యూ విద్యుదుత్పత్తి జరిగింది. ప్రాజక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా సోమవారం సాయంత్రం 8.611 టీఎంసీలు నమోదయ్యింది. ప్రాజక్టు నుంచి 92,628 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతుంది.

కలెక్టర్లతో మంత్రి జగదీష్ రెడ్డి టెలీ కాన్ఫరెన్స్

నల్గొండ, సెప్టెంబర్ 28:: గులాబ్ తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రి జగదీష్ రెడ్డి హెచ్చరించారు. రెస్క్యూ టీం లను అందుబాటులో ఉంచాలని, ప్రమాదాలు సంభవించకుండా విద్యుత్ శాఖాధికారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గులాబ్ తుఫాను రాష్ట్రంలో బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో మంగళవారం నాడు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కలెక్టర్లతో మంత్రి జగదీష్ రెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

గులాబ్ తుఫాన్ తీవ్రత పెరిగి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశించారు. కాన్ఫరెన్స్ సందర్భంగా ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఆయన సమీక్షించారు. ప్రమాదకరంగా ఉండే లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని, అలాగే ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు.

వర్షాల వల్ల ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకునేలా విద్యుత్ శాఖను అలెర్ట్ చేయాలని కలెక్టర్లకు చెప్పారు. అదే సమయంలో వైద్య ఆరోగ్యశాఖతో పాటు రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచాలని ఆయన ఆదేశించారు.

హుజురాబాద్ బైపోల్: స్వరం పెంచిన ఈటల..

హుజురాబాద్, సెప్టెంబర్ 28:హుజూరాబాద్ ఉప ఎన్నిక షెడ్యూల్ ప్రకటించడంతో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. ఎన్నికల ప్రచారాన్ని టీఆర్ఎస్, బీజేపీ నేతలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ప్రత్యర్థులపై మాటల తూటాలు పేల్చుతున్నారు. బీజేపీ తరుపున బరిలో ఉన్న ఈటల రాజేందర్.. టీఆర్ఎస్ పార్టీనే టార్గెట్ గా దూసుకుపోతున్నారు. సీఎం కేసీఆర్, మంత్రులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్ అహంకానికి, హుజురాబాద్ ప్రజల ఆత్మగౌరవానికి జరుగుతున్న ఎన్నిక" అని ఈటల అని అభివర్ణించారు. సిఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేశారని మండిపడ్డారు. ఉప ఎన్నిక కోసం టీఆర్ఎస్ పార్టీ నేతలు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో ప్రలోభాలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా హుజూరాబాద్ ప్రజలు ఈటలను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. మహిళలు, యువకులు, పెద్దలు అందరూ తన వెంటే ఉన్నారని ఈటల ధీమా వ్యక్తం చేశారు. మంత్రి హరీష్ రావు ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేశారని విమర్శించారు. రాత్రి పూట పోలీస్ జీపులతో బీజేపీ నేతలను భయపెడుతున్నారని మండిపడ్డారు. టీఆర్ఎస్ నీచపు పార్టీ అని.. ఆ పార్టీ నేతలు నీచపు మనుషులని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం దొంగ ఓట్లు చేర్పుతున్నారని ఆరోపించారు. చిల్లర చేష్టలు చేస్తే ప్రజలు సహించరని ఈటల వ్యాఖ్యానించారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిశన్‌ను ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయుష్మాన్ భారత్ డిజిట్ మిశన్ ను ఈ రోజు న ఒక వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భం లో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఆరోగ్య సదుపాయాల ను పటిష్ట పరచేందుకు గత ఏడు సంవత్సరాలు గా సాగుతున్న ఉద్యమం ఈ రోజు న ఒక కొత్త దశ లో ప్రవేశిస్తోందన్నారు. "భారతదేశం లో ఆరోగ్య సదుపాయాల లో ఒక క్రాంతికారి మార్పు ను తీసుకు వచ్చే సత్తా కలిగినటువంటి ఒక మిశన్ ను మనం ఈ రోజు న ప్రారంభించుకొంటున్నాం" అని ప్రధాన మంత్రి అన్నారు.

130 కోట్ల ఆధార్ సంఖ్య లు, 118 కోట్ల మంది మొబైల్ చందాదారులు, దాదాపు 80 కోట్ల మంది ఇంటర్ నెట్ వినియోగదారులు, సుమారు 43 కోట్ల జన్ ధన్ బ్యాంకు ఖాతా లు.. ఇంతగా సంధానం అయినటువంటి మౌలిక సదుపాయాల వ్యవస్థ ప్రపంచం లో ఎక్కడా కూడా లేదు అనేది యథార్థం అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అనేది ఆహార పదార్థాలు మొదలుకొని పాలన యంత్రాంగం వరకు ప్రతి దాని ని భారతదేశం లోని సామాన్యుల చెంత కు వేగం గాను, పారదర్శకమైన పద్ధతి లోను చేర్చుతోంది అని ఆయన అన్నారు. "ప్రస్తుతం పరిపాలన సంబంధి సంస్కరణల లో సాంకేతిక విజ్ఞానాన్ని మోహరిస్తున్న తీరు ఇంతకు ముందు ఎన్నడూ ఎరుగని విధంగా ఉంది" అని ప్రధాన మంత్రి అన్నారు.

కరోనా సంక్రమణ విస్తరణ ను అడ్డుకోవడం లో 'ఆరోగ్య సేతు ఏప్' ఎంతగానో తోడ్పడింది అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రస్తుతం భారతదేశం సుమారు 90 కోట్ల వ్యాక్సీన్ డోజుల ను ఇప్పించి, ఒక రికార్డు ను నెలకొల్పడం లో 'కో-విన్' (అనీ-చిఎఐ) పోషించిన పాత్ర ను ఆయన ప్రశంసించారు.

టెలిమెడిసిన్ సేవలు కూడా కరోనా కాలం లో అపూర్వమైన రీతి లో విస్తరించాయి. ఇంతవరకు ఇ-సంజీవని ద్వారా దాదాపు గా 125 కోట్ల రిమోట్ కన్ సల్టేశన్స్ పూర్తి అయ్యాయి అని ప్రధాన మంత్రి వివరించారు. ఈ సదుపాయం దేశం లోని దూర, సుదూర ప్రాంతాల లో నివసిస్తున్నటువంటి వేల కొద్దీ దేశ వాసుల ను వారి ఇళ్ల లో నుంచే నగరాల లో పెద్ద పెద్ద ఆసుపత్రుల వైద్యుల తో జోడిస్తోంది అని ప్రధాన మంత్రి అన్నారు.

ఆయుష్మాన్ భారత్-పిఎంజెఎవై పేదల జీవితాల లో ఒక ప్రధానమైన సమస్య ను తీర్చింది అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. ఇంతవరకు 2 కోట్ల మంది కి పైగా దేశవాసులు ఈ పథకం లో భాగం గా ఉచిత వైద్య చికిత్స సదుపాయాన్ని వినియోగించుకున్నారని, వారిలో సగం మంది మహిళలే అని ఆయన తెలిపారు. కుటుంబాలు పేదరికం విషవలయం లో చిక్కుకోవడానికి కీలకమైన ఒక కారణం ఏదీ అంటే, అది వ్యాధులు; కుటుంబాల లోని మహిళలు వారి ఆరోగ్య సమస్యల ను ఉపేక్షిస్తూ తీవ్ర బాధితులు గా మిగిలిపోతున్నారు అని ఆయన అన్నారు. ఆయుష్మాన్ తాలూకు లబ్ధిదారుల లో కొంత మంది తో స్వయం గా భేటీ అయ్యేందుకు తాను చొరవ తీసుకొన్నట్లు, ఆ భేటీ లలో ఈ పథకం తాలూకు ప్రయోజనాల ను గురించి తాను గ్రహించగలిగినట్లు ఆయన చెప్పారు. "ఈ ఆరోగ్య సంరక్షణ సంబంధి పరిష్కారాలు దేశాని కి వర్తమానం లోను, భవిష్యత్తు లోను ఒక పెద్ద పెట్టుబడి గా నిలుస్తాయి" అని ఆయన అన్నారు.

ఆయుష్మాన్ భారత్-డిజిటల్ మిశన్ ఇక మీదట దేశవ్యాప్తం గా ఆసుపత్రుల లోని డిజిటల్ హెల్త్ సల్యూశన్స్ ను ఒకదానితో మరొకదానిని జోడిస్తుంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ మిశన్ ఆసుపత్రుల లో ప్రక్రియల ను సులభతరం గా మార్చివేయడం ఒక్కటే కాకుండా జీవించడం లో సౌలభ్యాన్ని కూడా పెంచుతుంది అని ఆయన తెలిపారు. దీని లో భాగం గా, దేశం లోని ప్రతి ఒక్కరు ఇకపై ఒక డిజిటల్ హెల్త్ ఐడి ని అందుకొంటారని, మరి వారి హెల్త్ రికార్డు ను డిజిటల్ మాధ్యమం లో భద్రపరచడం జరుగుతుందని ప్రధాన మంత్రి వివరించారు.

భారతదేశం సమగ్రమైన, అందరి ని కలుపుకొని పోయేటటువంటి ఒక హెల్త్ మాడల్ ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది

అని ప్రధాన మంత్రి వెల్లడించారు. ఈ మాడల్ నివారణ ప్రధానమైనటువంటి ఆరోగ్య సంరక్షణ కు పెద్ద పీట వేస్తుంది. అదే కాలం లో వ్యాధి బారిన పడిన పక్షం లో, సులభమైనటువంటి తక్కువ ఖర్చు తో కూడినటువంటి ఇట్టే అందుబాటు లో ఉండేటటువంటి వైద్య చికిత్స కు కూడా దీనిలో ప్రాధాన్యం ఉంటుంది అని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య సంబంధి విద్య లో ఇదివరకు ఎరుగనటువంటి సంస్కరణల ను గురించి కూడా ఆయన చర్చించారు. గడచిన 7-8 సంవత్సరాల తో పోలిస్తే ప్రస్తుతం భారతదేశం లో మరింత ఎక్కువ సంఖ్య లో డాక్టర్ లను, పారా మెడికల్ మేన్ పవర్ ను తీర్చిదిద్దడం జరుగుతోంది అని ఆయన అన్నారు. ఒక సమగ్రమైనటువంటి ఎఐఐఎమ్ఎస్ తో పాటు, ఇతర ఆధునిక ఆరోగ్య సంస్థల నెట్ వర్క్ ను దేశం లో ఏర్పాటు చేయడం జరుగుతోంది. ప్రతి మూడు లోక్ సభ నియోజక వర్గాల పరిధి లో ఒక వైద్య కళాశాల చొప్పున స్థాపించేందుకు కృషి జరుగుతోంది అని ఆయన చెప్పారు. గ్రామాల లో ఆరోగ్య సదుపాయాల ను పటిష్ట పరచడం గురించి కూడా ఆయన వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నెట్ వర్క్ లను, వెల్ నెస్ సెంటర్ లను బలోపేతం చేయడం జరుగుతోందన్నారు. ఆ తరహా కేంద్రాల ను 80,000 కు పైగా ఇప్పటికే పని చేయించడం ప్రారంభించడమైంది అని ప్రధాన మంత్రి అన్నారు.

ఈ నాటి కార్యక్రమాన్ని ప్రపంచ పర్యటన దినం నాడు నిర్వహించుకోవడం జరుగుతోంది అని ప్రధాన మంత్రి ప్రస్తావించి, పర్యటన కు ఆరోగ్యం తో చాలా బలమైన సంబంధం ఉంది అన్నారు. ఇలా ఎందుకంటే, ఎప్పుడైతే మన ఆరోగ్యపరమైన మౌలిక సదుపాయాల వ్యవస్థ ను ఏకీకరించడం, బలపరచడం జరుగుతుందో అప్పుడు అది పర్యటన రంగాని కి కూడా మెరుగులు దిద్దుతుంది అని ఆయన చెప్పారు.

ఆజాది కా అమృత్ మహోత్సవంలో జగత్‌సింగ్‌పూర్ గడకుజంగాలో ఉచిత మల్టీ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:దేశ 75 వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా పారాదీప్ పోర్టు ట్రస్టు (పిపిటి) జగత్‌సింగ్‌పూర్ గడకుజంగాలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించింది. గడకుజంగా యువజన సంఘం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని పారాదీప్ పోర్టు ట్రస్టు డిప్యూటీ చైర్మన్ శ్రీ ఏకే బోస్ ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో గడకుజంగా సర్పంచ్ శ్రీ సమపద్ కుమార్ బారిక్, పారదీప్ లేడీస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు శ్రీమతి సుచిస్మిత బోస్ ఇతర స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

పారాదీప్ పోర్టు ట్రస్ట్ ఆసుపత్రి సీఎంఓ డాక్టర్ ప్రహ్లాద్ పాండా వైద్యులు, సిబ్బంది సహకారంతో శిబిరంలో దాదాపు 1000 మందికి ఈసీజీ, రాపిడ్ గ్లూకోజ్ టెస్ట్ తదితర పరీక్షలను నిర్వహించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య సౌకర్యాలు తక్కువగా ఉన్న గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కోవిడ్-19 నిబంధనలను పాటిస్తూ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ బోస్ ప్రజల ఆరోగ్య సంరక్షణకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పోర్టు ట్రస్టు అవసరమైన అన్ని చర్యలను అమలు చేస్తుందని అన్నారు. మరికొన్ని ప్రాంతాలలో కూడా వైద్య శిబిరాలను నిర్వహిస్తామని ప్రాధాన్యత ఇస్తూ సామాజిక దూరాన్ని హామీ ఇచ్చారు. ప్రజలు పరిశుభ్రతకు పాటించి మాస్కులను ధరించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

4వ భారత్-అమెరికా హెల్త్ డైలాగ్‌ను ఉద్దేశించి ప్రసంగించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ఈరోజు తమ మంత్రిత్వ శాఖలో భారతదేశం ఆతిథ్యం ఇచ్చిన 4 వ ఇండో-యుఎస్ హెల్త్ డైలాగ్ ప్రారంభ సెషన్‌లో ప్రసంగించారు.

యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ (హెచ్‌హెచ్ఎస్) లో గ్లోబల్ అఫైర్స్ కార్యాలయం డైరెక్టర్ శ్రీమతి లాయిస్ పేస్ ఈ సంభాషణ కోసం యుఎస్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. ఆసియా మరియు పసిఫిక్, యుఎస్ డిపార్ట్మెంట్ (హెచ్‌హెచ్ఎస్) లో గ్లోబల్ అఫైర్స్ కార్యాలయం డైరెక్టర్ శ్రీమతి మిచెల్ మెక్‌కానెల్ పాల్గొన్నారు. డాక్టర్ మిచెల్ వోల్ఫ్, శ్రీమతి దయానా ఎం. బెన్నెల్ కూడా దీనిలో హాజరయ్యారు.

అలాగే కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, బయోటెక్నాలజీ విభాగం కార్యదర్శి డాక్టర్ రేణు స్వరూప్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరాం భార్గవ, మంత్రిత్వ శాఖలోని ఇతర సీనియర్ అధికారులు ఆరోగ్య శాఖ కార్యదర్శి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెండు దేశాల మధ్య ఆరోగ్య రంగంలో కొనసాగుతున్న బహుళ సహకారాలపై చర్చించడానికి రెండు రోజుల డైలాగ్ ఒక వేదికగా ఉపయోగపడుతుంది. ఈ దశ చర్చల కోసం ప్రణాళిక చేసిన అంశాల ప్రకారం ఎపిడెమియోలాజికల్ పరిశోధన మరియు నిఘా, వ్యాక్సిన్ అభివృద్ధి, వన్ హెల్త్, జూనోటిక్ మరియు వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులు, ఆరోగ్య వ్యవస్థలు మరియు ఆరోగ్య విధానాలు మొదలైన వాటిని బలోపేతం చేయడానికి సంబంధించిన సమస్యలను కలిగి ఉంటాయి.

కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఇరుపక్షాల మధ్య పరస్పర సంఘీభావాన్ని మంత్రి ఈ కార్యక్రమం ముందుంచారు. ఇక్కడ ఇరుపక్షాలు తమ నిరంతర మద్దతును అందించాయి. కోవిడ్ -19 వ్యాక్సీన్‌ను అభివృద్ధి చేయడానికి యుఎస్ ఆధారిత ఏజెన్సీలతో సహకరించే భారతీయ వ్యాక్సిన్ కంపెనీలలో కనిపించే ఔషధాలు, చికిత్సలు, వ్యాక్సిన్ అభివృద్ధికి సంబంధించి పరిశోధన, అభివృద్ధిలో భారతదేశం మరియు యుఎస్ సహకారాన్ని మెరుగుపరిచిన తీరును ఆమె ప్రశంసించారు.

మానసిక ఆరోగ్యంపై 2020 లో సంతకం చేసిన అవగాహన ఒప్పందాన్ని గుర్తు చేసిన మంత్రి, ఇరు దేశాల మధ్య ఆరోగ్య రంగంలో మెరుగైన సహకారాన్ని మరియు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసినట్లు వివరించారు. భారత ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, అమెరికా ఆరోగ్య మరియు మానవ సేవల శాఖ మధ్య మరో అవగాహన ఒప్పందం ఖరారు అయింది. ఆరోగ్య భద్రత వంటి సమస్యలను కవర్ చేసే సహకారానికి సంబంధించిన ప్రధాన అంశాలు మరియు భద్రత; అంటువ్యాధులు మరియు అంటువ్యాధులు కాని వ్యాధులు; హెల్త్ సిస్టమ్స్; మరియు ఆరోగ్య విధానం.

ప్రపంచ ఆరోగ్య ముప్పుల ముందస్తు శాస్త్రీయ ఆవిష్కరణ మరియు నిర్వహణలో సహాయపడటానికి దేశాల మధ్య బాగా రూపొందించిన మరియు ధృవీకరించబడిన శాస్త్రీయ విధానాల ప్రస్తావన వచ్చింది. అంటు వ్యాధులను నివారించడానికి మరియు నియంత్రించడానికి ఈ అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలపై దృష్టి పెట్టవలసిన అవసరాన్ని డాక్టర్ పవార్ పునరుద్ఘాటించారు. ఆవిష్కరణల ద్వారా ఆరోగ్య వ్యవస్థల అసమానతలపై పోరాడటానికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగం కలిసి పనిచేయాలని, ఆ సామర్థ్యాలను మిళితం చేయాలని కూడా ఆమె స్పష్టం చేశారు.

భారతదేశం, అమెరికాలోని బహుళ ఏజెన్సీలతో ఆరోగ్య ఎజెండాలో భాగస్వామ్య పరిధిని విస్తృతం చేయడానికి ఉపయోగపడే వివరణాత్మక చర్చల కోసం పాల్గొనే వారందరికీ ఈ వేదిక ఒక అవకాశాన్ని అందిస్తుందని ఆమె తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టండి : కలెక్టర్ శివలింగయ్య

జనగామ, సెప్టెంబర్ 28: : జిల్లాలోని తరిగొప్పుల మండలం పోతారం గ్రామాన్ని జిల్లా కలెక్టర్ శివ లింగయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన రహదారులను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. గ్రామంలో జరుగుతున్న హరితహారం పనుల గురించి పని ప్రదేశంలో కూలీలను వివరాలు తెలుసుకున్నారు. హరితహారం మొక్కలు అన్ని బతికేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

చిట్టెం రిజర్వాయర్‌కు భారీగా వరద



మక్తల్ రూరల్, సెప్టెంబర్ 28:: మక్తల్ మండలంలోని సంగం బండ పెద్ద వాగుపై నిర్మించిన చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు భారీగా వరదనీరు వచ్చి చేరింది. కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో సోమవారం రిజ ర్వాయర్ ఒక్క గేటు తెరచి నీటిని దిగువ జూరాల ప్రాజెక్టులోకి విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఇంజినీరు నాగశివ తెలిపారు.

సంగంబండ (చిట్టెం నర్సిరెడ్డి) బ్యాలెన్సింగ్ రిజర్వాయిర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3.317 టీఎంసీలు కాగా ప్రస్తు తం 2.56 టీఎంసీలు ఉంది. అయితే కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వరదనీరు అధికంగా రావడంతో స్పిల్‌వే ద్వారా ఒక గేటును తెరచి దిగువకు 500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఆయన తెలిపారు.

ఇదిలా ఉండగా సంగంబండ రిజార్వయిర్ నుంచి భారీగా వరద నీటిని విడదల చేయడం వల్ల పెద్ద వాగు పరిసర గ్రామాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ నాగశివ కోరారు.

ఏపీలో కొత్తగా 618 కరోనా కేసులు

అమరావతి, సెప్టెంబర్ 27:ఆంధ్రప్ర దేశ్ లో కరోనా కేసులు భారీగా తగ్గాయి. 24 గంటల్లో 38,నీ29 మంది శాంపిల్స్ పరీక్షించగా..618 మందికి పాజిటివ్ నిర్ధా రణ అయింది. అదే సమయంలో 1178 కర్నూల్ నుంచి పూర్తిగా ఆరోగ్యవంతులు అయ్యారు. వైరస్ తో ఆరుగురు మృతి చెం దారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మొత్తం 20,47,459 కి చేరింది ఇందులో 20, 20,835 మంది పూర్తిగా వైరస్ నుంచి కోలుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12482 కేసులు యాక్టివ్ గా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తం గా 14142 మంది వైరస్ తో మరణించారు.

ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించిన మంత్రి వేముల

నిజామాబాద్, సెప్టెంబర్ 28: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి జిల్లాలో వర్ష ప్రభావిత ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి అధిక వరద నీరు వస్తున్న నేపథ్యంలో డ్యాం దగ్గరికి చేరుకుని ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో పై అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గులాబ్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. నేతలందరూ స్థానికంగా అందుబాటులో ఉండాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలపై అధికారులతో క్షేత్ర స్థాయిలో సమీక్షిస్తున్నామని తెలిపారు.

అధికారులు ఎక్కడివారక్కడ ప్రజలకు అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. మత్స్యకార్మికులు చేపల వేటకు వెళ్లొద్దని మంత్రి సూచించారు. ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దన్నారు. జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.

వర్షాల వల్ల రైతులు పంట నష్టపోయారు. ప్రభుత్వానికి నష్ట పోయిన పంట అంచనా వేసి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్ ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్, నగంపేట్ టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, భూమేశ్వర్, జెడ్పిటిసిలు గంగాధర్, నర్సారెడ్డి, ఎంపిపిలు పద్మ, బురుకల సుకన్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగుకుండా చూడాలి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, సెప్టెంబర్ 28:: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ కలెక్టర్లను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అప్రమత్తం చేశారు. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు.

గులాబ్ తుఫాన్ ప్రభావంతో మంగళవారం, బుధవారం భారీ వర్షాలు కురుస్తాయని, ఈ పరిస్థితులలో ఏ విధమైన ప్రాణ ఆస్తి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖ సమన్వయ

లండన్‌లో మెగా బతుకమ్మ వేడుకలు.. పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ , సెప్టెంబర్ 28:తెలంగాణ జాగృతి లండన్ విభాగం ఆధ్వర్యంలో జరిగే మెగా బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను దేశ విదేశాల్లోనూ ఘనంగా నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతి నాయకులను ఎమ్మెల్సీ కవిత అభినందించారు. తెలంగాణ జాగృతి యూకే విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 10వ తేదీన లండన్‌లో మెగా బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. బతుకమ్మ వేడుకల్లో యూకే తెలంగాణ జాగృతి ప్రతినిధులు, ప్రవాస తెలంగాణ వాసులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు.

అక్టోబర్ 10వ తేదీన బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే ఆడబిడ్డలకు తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా చేనేత చీరలను అందించనున్నామని తెలంగాణ జాగృతి యూకే విభాగం అధ్యక్షులు సుమన్ బల్మూరి పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడే రాజీవ్ సాగర్, స్టేట్ జనరల్ సెక్రెటరీ నవీన్ ఆచారి, స్టేట్ సెక్రెటరీ రోహిత్ రావు, తెలంగాణ జాగృతి నాయకులు ప్రశాంత్ పూస, నితిష్, రోహిత్ రావ్, దినేష్ రెడ్డి, అనుషా దుర్గా, జితూ, రోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత..

సూర్యపేట, సెప్టెంబర్ 28: సూర్యపేట జిల్లాలో గంజాయి ముఠా గుట్టు రట్టు చేశారు పోలీసులు. జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలో సూర్యాపేట పట్టణ పోలీసులు, సీసీఎస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించి 120 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిర్మల్ జిల్లా మామడ మండలం కిషన్‌రావు పేటకు చెందిన జాదవ్ అశోక్, ఏపీలోని విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలం గౌరవపాలెంకు చెందిన బొడ్డు మల్లికార్జున్ రావు ఇద్దరు కలిసి విశాఖపట్నం చుట్టుపక్కల నుంచి తక్కువ ధరకు గంజాయిని సేకరించేవారు. సేకరించిన గంజాయిని హైదరాబాద్, మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్మేందుకు కార్లలో తీసుకెళ్తున్నారు.

ఈ క్రమంలో పోలీసులు కొత్త బస్టాండ్ వద్ద తనిఖీల్లో భాగంగా వీరు కార్లను ఆపి ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పారు. వారి కార్లను సోదా చేయగా సుమారు 120 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .గంజాయిని పట్టుకున్న సీసీఎస్ సీఐ రాఘవరావు, పట్టణ ఇన్‌చార్జి సీఐ రాజేష్, ఎస్ఐ శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

విజయనగరం జిల్లా పార్వతీపురం ప్రాంతంలో సువర్ణముఖినది ఆకస్మిక వరదల్లో రాత్రి సమయంలో భారత నావికాదళ హెలికాప్టర్‌లో తరలింపులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:ఆకస్మిక వరదల కారణంగా సువర్ణముఖి నదిలో చిక్కుకున్న గ్రామస్తున్ని రక్షించేందుకు సోమవారం సాయంత్రం 5:30 గంటలకు రాష్ట్ర పరిపాలన అధికారుల నుండి ఎస్ఓఎస్ అభ్యర్థన అందింది. దీంతో బాధితుడి శోధన మరియు రక్షణ (ఎస్ఎఆర్) కోసం నావికాదళ హెలికాప్టర్ అందించడానికి ఈస్టర్న్ నేవల్ కమాండ్ వెంటనే మిషన్ కోసం ఐఎన్ఎస్ డేగా నుండి అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ (ఎఎల్‌హెచ్) ని మోహరించింది. నివేదించబడిన ప్రదేశానికి చేరుకున్న తర్వాత (డేగా నుండి సుమారు 120 కిమీ) తీవ్రమైన వాతావరణం, భారీ వర్షం మరియు చీకటి పరిస్థితుల కారణంగా ఎయిర్‌క్రాఫ్ట్ గ్రామస్తుడిని గుర్తించలేకపోయింది. తదనంతరం రాత్రి 11 గంటల సమయంలో రెస్క్యూ మిషన్ చేపట్టడానికి తగిన నైట్ విజన్ పరికరాలతో కూడిన సీకింగ్ 42సి హెలికాప్టర్ బయల్దేరింది. ఇలాంటి వర్షపు వాతావరణం మరియు బలమైన గాలులు ఉన్నప్పటికీ సీకింగ్ హెలికాప్టర్ శోధన చేపట్టి బాధితుడిని ప్రాణాలతో బయటకు తీసుకువచ్చింది. హెలికాప్టర్ సువర్ణముఖి నదిలో చాలా తక్కువ ఎత్తులో ఎగురుతూ బాధితుడిని రక్షించగలిగింది. అనంతరం ఎయిర్‌క్రాఫ్ట్ ఐఎన్ఎస్ డేగాకు తిరిగి వచ్చింది. బాధితుడికి అందులోనే ప్రాథమిక చికిత్స అందించబడింది. అనంతరం వారిని తదుపరి వైద్య చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. నావల్ ఎయిర్ స్టేషన్ ద్వారా అతని కుటుంబ సభ్యులకు అతని శ్రేయస్సు గురించి సమాచారం అందించబడింది.

ప్రాణాలతో బయటపడిన శ్రీ డి సింహాచలం, విజయనగరం జిల్లాలోని వెంకటభైరవపాలెం గ్రామానికి చెందిన సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి. రాత్రి సమయంలో సకాలంలో సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అసోచామ్ మత్స్య, ఆక్వాకల్చర్ రంగం పరిశ్రమను ఉద్దేశించి ప్రసంగించిన కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:కోవిడ్ మహమ్మారి కాలానంతరం మత్స్య, ఆక్వా కల్చర్ రంగాలను పునరుజ్జీవనం చేసేందుకు ప్రత్యేక పద్ధతిపై నేడు కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల ప్రసంగించనున్నారు. ఈ క్రమంలో ఈ రంగాన్ని ప్రోత్సహించి, అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎంఎంఎస్‌వై, ఇతర పథకాల విశేషతలను పట్టి చూపనున్నారు.

మత్స్య, ఆక్వా కల్చర్ పరిశ్రమకు సంబంధించి దేశంలోని అత్యున్నత చాంబర్ ఆఫ్ కామర్స్ అయిన అసోచామ్ (యూఆఅఊంఓ) నేడు వర్చువల్ కాన్ఫరెన్స్ ను నిర్వహించనుంది. నీలి విప్లవం, ఆర్థిక వృద్ధికి తోడ్పడే వ్యూహాత్మక మార్గదర్శకం అన్నది ఈ సమావేశ ఇతివృత్తం. ఈ రంగం చెప్పుకోదగిన వేగంతో మెరుగుపరిచి, మత్స్య, ఆక్వాకల్చర్ నూతన శకంలోకి ప్రవేశించేందుకు ఈ రంగంలో తాజా అవకాశాలపై దృష్టి పెట్టి ఉత్పాదకతను మెరుగుపరచడం, అలాగే సాంకేతికత, మార్కెటింగ్, ఫైనాన్స్, ఎగుమతి, మౌలిక సౌకర్యాలు వంటి అవసరమైన చర్యలపై చర్చించనున్నారు. కేంద్ర మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల సమక్షంలో, దేశవ్యాప్తంగా భిన్న నేపథ్యాల నుంచి వచ్చినన వక్తలతో, ఈ సమావేశం దేశవ్యాప్తంగా మత్స్య, ఆక్వాకల్చర్ రంగాలను పునరుద్ధరించేందుకు అవకాశం ఉన్న అన్ని సంభావ్య పద్ధతులను చర్చించనున్నది. ఈ సమావేశంలో ప్రసంగించనున్న ప్రముఖ ప్రభుత్వ అతిథి, అధికారులలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ది మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కె ఎస్ శ్రీనివాస్, ఐఎఎస్, భారత మత్స్య శాఖ సంయుక్త కార్యదర్శి సాగర్ మెహ్రా, ఒరిస్సా ప్రభుత్వానికి చెందిన అగ్రికల్చర్ ప్రొమోషన్ ఇ ఇన్వెస్ట్ మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఒడిషా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్ట్ డాక్టర్ ప్రవత్ కుమార్ రౌల్ ఉన్నారు.

మత్స్య, ఆక్వాకల్చర్ పరిశ్రమల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, అసోచామ్ సెక్రెటరీ జనరల్ దీపక్ సూద్, మయాంక్ ఆక్వాకల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ ఎంశర్మ, ఆక్వా కనెక్ట్ చీఫ్ అలియెన్స్ అధికారి అమిత్ సాలుంఖే, అసోచామ్ చైర్మన్, గుజరాత్ కౌన్సిల్,, గ్రూప్ ప్రెసిడెంట్, వెల్ స్పన్ గ్రూప్ కార్పొరేట్ వ్యవహారాలు, స్ట్రాటజిక్ ప్లానింగ్ అధిపతి చింతన్ థాకర్, అసోచామ్ గుజరాత్ కౌన్సిల్‌కు చెందిన వ్యవసాయ వ్యవసాయ ప్రాసెసింగ్ కమిటీ చైర్మన్ ధావల్ రావల్ ప్రసంగించనున్నారు. ది ఎస్ఎంఇ ఇండియా పత్రిక ఎడిటర్ ఇన్ చీఫ్ డాక్టర్ వెంకటేష్ అయ్యర్ ఈ సదస్సుకు వడరేటర్‌గా వ్యవహరిస్తారు. మత్స్య, ఆక్వాకల్చర్ పరిశ్రమకు చెందిన ప్రధాన సంస్థలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఎగుమతిదారులు, విద్యావేత్తలు, బ్యూరోక్రాట్లు, ఎఫ్‌పిఒలు, పరిశ్రమకు చెందిన ఇతర ప్రొఫెషనల్స్ హాజరుకానున్నారు.

ఫినో పేమెంట్స్ అంబాసిడర్‌గా పంకజ్ త్రిపాఠి



ముంబై, సెప్టెంబర్ 28: ప్రముఖ ఫినో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ తన సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ బాలీవుడ్ నటుడు పంకజ్ త్రిపాఠీని జతచేర్చుకుంది. పంకజ్ బాండ్‌తో కలిసి ఫినో ఉత్పత్తులు, సేవలను ప్రోత్సహించడంలో ఫినోకు స్నేహపూర్వక సహకారాన్ని అందిస్తారు. కళాకారుడు పంకజ్ త్రిపాఠి మా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం మాకు చాలా సంతోషంగా ఉంది. పంకజ్ వ్యక్తిత్వం మా బ్రాండ్ విలువలను పెంచుతుంది. డిజిటల్ బ్యాకింగ్‌ను స్వీకరించే దిశగా వినియోగదారుల ప్రవర్తనలో ఒక నమూనా మార్పును తీసుకురావడంలో అసోసియేషన్ చాలా దూరం వెళ్తుందని నమ్ముతున్నామని ఫినో పమెంట్స్ బ్యాంక్ సీనియర్ డివిజన్ హెడ్ బిశ్వజీత్ సిన్హా అన్నారు.

బాధితుడికి రూ.3లక్షల ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, సెప్టెంబర్ 28:: మండల పరిధిలోని అంకిరావుపల్లి గ్రామానికి చెందిన చంద్రారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని గ్రామ టీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు.

దీంతో బాధితుడు చంద్రారెడ్డి మెరుగైన వైద్య సాయం కోసం ఎమ్మెల్యే బీరం సీఎం సహాయ నిధి నుంచి రూ.3లక్షలు ఎల్వోసీని మంజూరు చేయించారు. సదరు ఎల్వోసీని హైదరా బాద్‌లోని తన నివాసంలో బాధితుడి కుటుంబ సభ్యుడికి మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు.

పంచాయతీరాజ్, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవ వేతనం పెంపు

హైదరాబాద్ , సెప్టెంబర్ 28: రాష్ట్రంలో పంచాయతీరాజ్, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం పెంచింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచుల గౌరవ వేతనాన్ని 30 శాతం మేర పెరిగాయి. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జడ్పీటీసీ, ఎంపీపీల గౌరవ వేతనం రూ.13వేలకు చేరింది. ప్రస్తుతం వారి వేతనం రూ.10వేలుగా ఉన్నది. ఎంపీటీసీలు, సర్పంచుల వేతనం రూ.6500కు పెరిగింది. ప్రభుత్వం నిర్ణయంతో ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

భైంసాలోని లోతట్టు కాలనీలు జలమయం

నిర్మల్, సెప్టెంబర్ 28:: గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో భైంసాలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ఆటోనగర్‌లోకి వరద పోటెత్తింది. మహారాష్ట్ర నుంచి వస్తున్న నీటితో మహాగాం వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. గుండెగాం చుట్టూ వరద చేరింది.

కాగా... గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ఈరోజు ఉదయం అధికారులు ప్రాజెక్ట్ 3 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్ట్ నుంచి 39,726 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో 31,920 క్యూసెక్కులుగా కొనసాగుతుంది. గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 అడుగులు కాగా, ప్రస్తుతం 358.7అడుగులుగా ఉంది.

సూర్యాపేట జిల్లాలో ఘోర ప్రమాదం..

సూర్యాపేట,సెప్టెంబర్ 28: చింతలపాలెం మండలం, బుక్కామాదారం వద్ద బుగ్గా వాగులో ఓ లారీ ఫల్టీ కొట్టింది. అయితే లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. అర్ధరాత్రి సమయంలో కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట వైపు నుంచి చింతలపాలెం మండలం వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే రాత్రి సమయం కావడంతో లారీ డ్రైవర్‌కు వాగులోతు, ఉధృతి తెలయలేదు. దీంతో డ్రైవర్, క్లీనర్ తెల్లవారే వరకు లారీపైనే బిక్కు బిక్కు మంటూ గడిపారు. రెండు మూడు రోజులుగా బుగ్గవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జగ్గయ్యపేట, చింతలపాలెం మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

రుద్రవరం గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ,పచ్చి మట్ల మహేష్ గౌడ్. ఉప అధ్యక్షుడిగా .

కట్ట రమేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శిగా .పార్వతి వాడకట్టు రవి గౌడ్ . కోశాధికారిగా గాలి పెల్లి శ్రీధర్ గౌడ్ , కార్యదర్శిగా ఆతి కం కనకయ్య గౌడ్ కార్యవర్గ సభ్యులుగా పార్వతి చిన్న రవి గౌడ్ . గాలి పెల్లి రామచంద్ర గౌడ్ , పచ్చి మట్ల అంజయ్య గౌడ్ . కట్ట అంజయ్య గౌడ్ . మంద అనిల్ గౌడ్ , పార్వతి శ్రీకాంత్ గౌడ్ గాలి పెల్లి కృష్ణమూర్తి అలాగే గౌడ సంఘం రైటర్ గా గాలి పెల్లి సతీష్ గౌడ్ లనుఎన్నుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే కోడూరికి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శ

కరీంనగర్ సెప్టెంబర్ 28:(నేటినిజం ప్రతినిధి): చొప్పదండి మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ తల్లి ఇటీవలే పరమపదించిన నేపథ్యంలో నగరంలో ఆయన నివాసంలో సత్యనారాయణ గౌడ్ ను కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పరామర్శించారు.

ఎమ్మెల్సీ వెంట పరామర్శించిన వారిలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సమద్ నవాబ్, ఉప్పరి రవి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కొలిపాక సందీప్, అబ్దుల్ రహమాన్, ఖమరొద్దీన్, ముక్క భాస్కర్, తమ్మడి ఏజ్రా తదితరులు పాల్గొన్నారు.

షహీద్ భగత్ సింగ్‌కు ఘన నివాళి

-యువతకు స్ఫూర్తినిచ్చిన భగత్ సింగ్ వీరత్వం..

-బిజెపి సెంట్రల్ జోన్ అధ్యక్షుడు.. కార్పొరేటర్ దుర్షేడ్ అనూప్ కుమార్

కరీంనగర్ సెప్టెంబర్ 28:(నేటినిజం ప్రతినిధి): దేశ స్వాతంత్ర్యం కోసం చావుకైనా వెనుకాడని ధీరుడు.. ఆంగ్లేయుల చేతిలో ఉరికంభం ఎక్కిన భరత మాత ముద్దుబిడ్డ షహీద్ భగత్ సింగ్ అని ఆయన వీరత్వం.. అమరత్వం ఈ దేశం ఎప్పటికి మర్చిపోదని బిజెపి సెంట్రల్ జోన్ అధ్యక్షుడు 48వ డివిజన్ కార్పొరేటర్ దుర్షేడ్ అనూప్ కుమార్ అన్నారు.

మంగళవారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా మాడిశెట్టి వినోద్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్ త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. దేశం కోసం.. ధర్మం కోసం భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకోవాలని యువతను కోరారు. నాడు దేశ స్వాతంత్ర్య సాధన కోసం.. భరత మాత విముక్తి కోసం ఉరి కంభాన్ని సైతం ముద్దాడిన యోధుడు భగత్ సింగ్ అని చెప్పారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్, రఘు, పరంధాములు, గోపాల్, రమేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌కు కొనసాగుతున్న వరద.. దిగువకు 2500 క్యూసెక్కుల నీరు విడుదల

హైదరాబాద్ , సెప్టెంబర్ 28: పాలమూరు జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు, దేవరకద్ర మండలంలోని మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు కోయిల్ సాగర్‌కు మంగళవారం ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టుకు 2వేల క్యూసెక్కుల నీరు చేరుతుం డటంతో 3గేట్ల ద్వారా 2500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.

ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వారంరోజులుగా కురుస్తున్నవర్షాలకు నీటి వరద ప్రాజెక్టుకు వచ్చిచేరుతున్నట్లు తెలిపారు. ప్రాజె క్టులో అప్పటికే 32.5 అడుగులు(2.25టీఎంసీలు)నీరు ఉన్నసందర్భంగా, వరద ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటిని వదులుతున్నామని వెల్లడించారు.ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.6అడుగులు(2.27 టీఎంసీలు) అని తెలిపారు.

రాత్రి నుంచి బూతులు తిడుతూ వందలాది మెసేజులు వస్తున్నాయి: పోసాని

హైదరాబాద్ , సెప్టెంబర్ 28: ఏపీలో ఆన్ లైన్‌లో సినిమా టికెట్ల అమ్మకాల వ్యవహారం రచ్చ రచ్చ అవుతోంది. వైసీపీ వర్సెస్ జనసేనగా మారింది. రిపబ్లిక్ సినిమా ఫంక్షన్‌లో ఏపీ ప్రభుత్వంపై పవన్ చేసిన వ్యాఖ్యలతో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. పవన్‌కు కౌంటర్‌గా వైసీపీ మంత్రులు ఘాటుగానే విమర్శలు చేశారు. మరోవైపు సినీ నటుడు పోసాని కృష్ణ మురళి కూడా ఇప్పటికే పవన్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

తాజాగా మరోసారి ప్రెస్ మీట్ పెట్టి పవన్‌పై విమర్శలు చేశారు. సోమవారం రాత్రి నుంచి ఇప్పటి వరకు తనకు ఫోన్లు వస్తూనే ఉన్నాయన్నారు. జగన్‌ను పవన్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. చిరంజీవిని కేశినేని నాని విమర్శించారని గుర్తు చేశారు. కేశినేని నాని వద్దకు వెళ్లి నిలదీశానని, దానితో నాని ఇంటికి వెళ్లిపోయారని పోసాని పేర్కొన్నారు. " ఫ్యాన్స్‌తో గ్రూపును పెట్టుకున్నాడు. ఫంక్షన్లకు తన ఫాన్స్‌ను పంపిస్తున్నాడు. నువ్వు సద్దాం హుస్సేన్ లా నియంతవా. పవన్ కల్యాణ్ ఒక సైకో. నా భార్యపై ఆరోపణలు చేసి నైతికంగా దెబ్బతీయాలని చూస్తున్నారు. విష్ణుబాబు నామినేషన్ వేయడానికి వస్తే అక్కడా పవన్ బ్యాచ్ ఉంది. పవన్ కల్యాణ్ నేను డీమోరలైజ్ కాను. పవన్ కల్యాణ్ రోజూ నన్ను తిట్టు.. నేనిలానే బతుకుతా.. సర్దార్ గబ్బర్ సింగ్ సినిమా టైమ్ లో నాకు, పవన్ మధ్య విభేదాలు వచ్చాయి. షూటింగ్ సమయంలో పవన్ నన్ను ఇబ్బందులు పెట్టారు. షూటింగ్‌లో సమయ పాలన పాటించని పవన్ కల్యాణ్. పవన్‌ను కేసీఆర్ బహిరంగంగా హెచ్చరించారు. అప్పుడు పవన్ అభిమానులు ఎందుకు ఊరుకున్నారు. జగన్‌పై విమర్శలు చేయడంతోనే నేను రియాక్ అయ్యానని" అని పోసాని తెలిపారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న కత్తి సిద్ధార్థ్ అనే విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయానికిఎంపికయ్యాడు. సిద్ధార్థ్ ప్రభుత్వ పాఠశాలలో చదివి నవోదయ విద్యాలయ నికి ఎంపిక కావడం పట్ల గ్రామ సర్పంచ్ సిరికొండ ప్రేమలత–శ్రీనివాస్. ఎంపిటిసి పులి రేణుక – సత్యం. విద్యా కమిటీ చైర్మన్ పెద్ది శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయులు వికృతి లక్ష్మీనారాయణ ను. ఉపాధ్యాయులను అభినందించారు.

బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలి

-జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 278(నేటినిజం ప్రతినిధి): వేములవాడ విలీన గ్రామమైన శాత్రాజ్ పల్లి వెళ్లే రహదారిలో గంజి వాగు దగ్గర వర్షం రావడంతో రాకపోకలకు చాలా అంతరాయం కలుగుతుందని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంఘ స్వామి యాదవ్ అన్నారు ఆయన మాట్లాడుతూ వేములవాడ శాత్రాజ్ పల్లి మీదిగా గా ఈ రోడ్డు నుండి కొండగట్టు ధర్మపురి కి వెళ్లే భక్తులు గాని ప్రజలకు వర్షం రావడంతో తీవ్రంగా ఇబ్బంది అవుతుందని వెంటనే నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com